వాణి విషాదంగా ఒక చిన్న నవ్వు నవ్వింది....

దుర్గారావు సహాయంతో పిక్చరు పూర్తి అయింది. అందులో వాణి నటనను సినీ జర్నలిస్టులు మెచ్చుకుని, అటువంటి వేషాలే వెయ్యమని సలహా యిచ్చారు.

పిక్చరు రిలీజవుతూనే హిట్టవుతుందని తేలిపోయింది. ఆ నెల్లూరులోనే అదే థియేటరులో మళ్ళీ తన పిక్చరు చూసుకుని, ఆడియన్స్ రియాక్షను చూసి వాణి ఆనందాశ్రువులు రాల్చింది.

నెల్లూరు నుంచి దుర్గారావు కార్లో తిరిగివచ్చేటప్పుడు బుల్లెమ్మ తనకు నిద్ర వస్తున్నదని వెనక సీటు ఆక్రమించేసింది. వాణి దుర్గారావు పక్కన ముందు సీటులో కూర్చున్నది.

"ఎలా ఉంది?" అన్నాడతను అకస్మాత్తుగా.

"ఏమిటి?" అన్నది వాణి ఆశ్చర్యంగా.

"తడువుకోకుండా ఏదో ఒకటి చెయ్యాలి గాని, ప్రశ్నకు ప్రశ్న వెయ్య గూడదు."

"మీ రుణం తీర్చుకోలేను."

"అయితే నన్ను పెళ్ళాడెయ్యి."

"బుల్లెమ్మ గొంతు కోస్తారా?"

"ఓహో, నేనేం చేసినా బుల్లెమ్మ గొంతుకు డేంజరే నన్నమాట. నీకా భయం ఏమీ అవసరం లేదు. బుల్లెమ్మ సపోర్టుతో ఈ నాటకం ఆడాను."

వాణికి శివం ఎత్తినట్టయింది. ఆమె అతని మెడ మీదుగా చెయ్యి వేసి గట్టిగా వాటేసుకున్నది.

దుర్గారావు కారుకు సడెన్ బ్రేక్ వేశాడు.

ఒక అర నిమిషం అయాక, వెనక సీటులోంచి బుల్లెమ్మ గొంతు తాపీగా వినిపించింది!

"ఏమర్రా, కారూ, దయిలాగూ రెండూ ఆగిపొయ్యాయేం?"

[ముద్రణ : 1966, మారిన జీవితం కథల సంపుటి,
నవభారత్ ప్రచురణ, మొదటి ముద్రణ.]